



పెన్షనర్లు ఖుష్

- లైఫ్ సర్టిఫికెట్లు పొందడం మరింత ఈజీ..
- తపాల శాఖ ద్వారా సేవలు విస్తృతం
- విశ్రాంత ఉద్యోగులకు ఇంటి వద్దే జీవనధ్రువీరణ పత్రాల అందచేత
- ఆధార్ కార్డు, పీపీవో నెంబరు, వేలిముద్రతో జారీ
- జిల్లా వ్యాప్తంగా మూడువేల మంది

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పెన్షనర్లు తమ ఇంటివద్దనే ఇకనుంచి జీవనధ్రువీరణ పత్రం (డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ల)ను పొందవచ్చు. ఈ సదవకాశాన్ని పోస్టల్ శాఖ అందుబాటులోకి తీసుకువచ్చింది. బ్రాంచ్ పోస్టుమాస్టర్, పోస్ట్‌మెన్‌లకు సమాచారం అందిస్తే చాలు.. వారిఇంటి వద్దకు వచ్చి పెన్షనర్లకు ఆన్‌లైన్ సేవల ద్వారా బయోమెట్రిక్ విధానంతో డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లను అందిస్తారు. వీటిని ట్రెజరరీ కార్యాలయం వారు డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందిన వారు (విశ్రాంత ఉద్యోగులు) వారి చేసిన సేవలకు గాను ప్రభుత్వం నుంచి ప్రతీనెల పెన్షన్ పొందుతారు. ఏటా సంవత్సరం అక్టోబరు, నవంబరు, డిసెంబరు మాసాల్లో ట్రెజరరీ కార్యాలయంలో జీవన ధ్రువీకరణ పత్రాలను అందించాల్సి ఉంటుంది. గతంలో మాన్యువల్ ఉన్న సమయంలో పెన్షనర్ ప్రభుత్వం నుంచి వచ్చిన ఒక ఫారంను నింపి నేరుగా ట్రెజరీ కార్యాలయంలో అందించేవారు. ఆయన ఆరోగ్యం సహకరించకుంటే వారి కుటుంబసభ్యులు సమర్పించాల్సి వస్తే ఫారంపై గెజిటెడ్ ఉద్యోగి సంతకం చేయించి, దానిని ఎస్టీవో కార్యాలయంలో అందించే వారు.

‘ఆన్‌లైన్’ సేవలు విస్తరించాక ఇలా..

‘ఆన్‌లైన్’ సేవలు క్రమక్రమంగా విస్తరించడంతో మూడేళ్లక్రితం గత ప్రభుత్వం టీయాప్ పోలియో ద్వారా పెన్షనర్ తన మొబైల్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్ ప్రాసెస్‌ను చేసేవారు. ఆ యాప్‌లో పెన్షన్ దారుడి వివరాలు పొందుపర్చగానే తన సెల్‌కు ఓటీపీ నెంబరు వస్తోంది. ఓటీపీ నెంబర్‌ను ఆధార్‌తో లింక్‌చేస్తే లెఫ్ సర్టిఫికెట్ ప్రాసెస్ పూర్తయి ట్రెజరరీ కార్యాలయాలనికి వెళ్లేది. అప్పుడు వారు దానిని డౌన్‌లోడ్ చేసుకునే వారు. అలా చేయరాని వారు మీసేవ కేంద్రాల్లోకి వెళ్లి జీవన ధ్రువీకరణ పత్రం పొందేవారు. దీనికి సంబంధించి కూడా ట్రెజరరీ కార్యాలయానికి సమాచారం వెళ్లితే వారు డౌన్‌లోడ్ చేసుకుని దానిని ఓకే చేసే వారు. ఇలా చేసినప్పటికి కొంతమంది పెన్షన్ దారులు జీవన ధ్రువీకరణ పత్రాలు ఓకే కాకపోవడంతో మళ్లీ మ్యానువల్‌గా ఫారంను నింపి నేరుగా ఎస్టీవో కార్యాలయానికి వెళ్లి ఇవ్వాల్సి వచ్చేది. ఇలా పెన్షనర్‌లు వివిధ రూపాల్లో లైఫ్ సర్టిఫికెట్ కోసం ఇబ్బందులు పడేవారు. మీసేవ కేంద్రాలకు వెళ్లాలన్న, మ్యానువల్‌గా ఇవ్వాలన్న ఇంట్లో నుంచి బయటకురావల్సి వచ్చేది. ఈక్రమంలో ఆరోగ్య పరంగా ఇబ్బందులు పడే పెన్షనర్లకు తిప్పలుండేవి. ఇవన్ని వ్యయ ప్రయాసాలతో కోర్చి చేస్తుండే వారు.

పోస్టల్ సేవలతో ఇంటి వద్దనే..

పెన్షనర్లకు ఇంటి వద్దనే డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు పోస్టల్ శాఖ శ్రీకారం చుట్టింది. దీంతో పెన్షనర్లకు ఇంటి వద్దనే డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు అందుతున్నాయి. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో హెడ్‌పోస్టాఫీస్‌తో పాటు 16 సబ్ పోస్టాఫీసులు, 196 బ్రాంచ్ పోస్టాఫీసులున్నాయి. జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వ నుంచి పెన్షన్ పొందే వారు సుమారు 2,500 వరకు, కేంద్రం, ఇతరత్రా పెన్షన్ పొందె వారు సుమారు 500 మంది మొత్తంగా 3000 మంది ఉద్యోగ విరమణ పెన్షన్‌పొందుతున్నారు. వారందరికి ఆయా పోసాఫీసుల ద్వారా సేవలందనున్నాయి. వీరంతా ఏటా చివరి మూడు మాసాల్లో జీవన ధ్రువీకరణ పత్రాన్ని ట్రెజరరీ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. ఇప్పుడు తపాలశాఖ అందిస్తున్న సేవలతో వారు ఇంటి వద్దనే ఉండి డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు పొందె అవకాశం ఉంది. కేవలం పెన్షనర్లు బ్రాంచ్ పోస్టు మాస్టర్ లేదా పోస్ట్‌మెన్‌కు సమాచారం అందిస్తే వారు పెన్షనర్ ఇంటికి వెళ్తారు. వారు రూ.70 చెల్లిస్తే ఆధార్‌కార్డు నెంబరు, పెన్షన్ పేమేంట్ నెంబరు (పీపీవో)తో బయోమెట్రిక్ విధానం ద్వారా వెంటనే డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ ఆన్‌లైన్ ద్వారా సంబంధిత కార్యాలయానికి మెసేజ్ వెళ్తుంది. అక్కడ వారు డౌన్‌లోడ్ చేసుకుంటే సరిపోతుంది. తద్వారా పెన్షనర్ ఎస్టీవో కార్యాలయానికి వెళ్లాల్సిన పని ఉండదు. మొత్తానికి పోస్టల్‌శాఖ సేవలతో ఇంటి వద్దనే డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు అందుతోండడంతో పెన్షనర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



వాసం అనిల్‌కుమార్, హెడ్ పోస్ట్‌మాస్టర్, మానుకోట హెడ్ పోస్టాఫీస్

పెన్షనర్లు పోస్టల్ శాఖ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలి. బ్రాంచ్‌పోస్ట్ మాస్టర్, పోస్ట్‌మాన్‌లకు సమాచారం అందిస్తే నేరుగా వారి ఇంటికి వెళ్లి బయోమెట్రిక్ ద్వారా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు అందిస్తున్నాం. వాటిని ట్రెజరరీ కార్యాలయం వారు డౌన్‌లోడ్ చేసుకుంటారు. దీంతో పెన్షనర్లు బయటకు రావాల్సిన పని లేదు. పోస్టల్ సేవలను పెన్షనర్లు వినియోగించుకోవాలి.

పోస్టల్ శాఖ సేవలు అభినందనీయం



మైస నాగయ్య, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్ల కోసం పోస్టల్ శాఖ అందిస్తున్న సేవలు అభినందనీయం. వయసు పైబడిన పెన్షనర్లకు ఈ సేవలు ఎంతగానో దోహదపడుతాయి. కొంత మంది పెన్షనర్ల వేలి ముద్రలు పడడం లేదు. అలాంటి వారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయానికి వస్తే మ్యాన్యువల్‌గా ఫారంను నింపి ట్రెజరరీ కార్యాలయంలో అందించే అవకాశం ఉంటుంది.



బయ్యారంలోని ఇనుప ఖనిజం గుట్ట, వెలికితీసిన ఇనుప ఖనిజం (ఫైల్)

ఉక్కు ఆశలు.. ఆవిరేనా?

- ఎండమావిగా బయ్యారం ఐరన్‌ఓర్ కర్మాగారం
- కేంద్ర ప్రభుత్వ ప్రకటనతో ఏజెన్సీలో తీవ్ర నిరాశ
- పోరాటాలకు సిద్ధమవుతున్న సాధన కమిటీ

6 లో..

‘బయ్యారం ఉక్కు.. తెలంగాణ హక్కు..’ అనే నినాదం మలిదశ తెలంగాణ ఉద్యమంలో మారుమోగింది. దీంతో కదిలిన నాటి కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం రాష్ట్ర విభజన చేసిన సమయంలో బయ్యారంలో ఉక్కుకర్మాగారాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చింది. విభజన చట్టంలోనూ చేర్చింది. కానీ ఆ తర్వాతి పరిణామాల్లో అది కార్యరూపం దాల్చలేదు. దశాబ్దకాలంగా నినాదంగానే మిగిలిన స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు ఆశలు ఆవిరయ్యాయి. ఈ పరిశ్రమ నిర్మాణం సాధ్యం కాదంటూ తాజాగా పార్లమెంట్ వేదికగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చేసిన ప్రకటన తీవ్ర నిరాశను మిగిల్చింది. స్థానికంగా ఉపాధి దొరుకుందని భావించిన వారికి ఆవేదనే మిగిలింది. కేంద్రం చేసిన ప్రకటనతో ఏజెన్సీ ప్రాంతంలో ఆగ్రహం పెల్లుబుకుతుండగా.. ఉక్కు కర్మాగారాన్ని సాధించుకునేందుకు సాధన కమిటీ పోరాటాలకు సిద్ధమవుతోంది. - బయ్యారం, ఆంధ్రజ్యోతి

నేడు మరిపెడకు మంత్రి పొంగులేటి రాక



మహబూబాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శనివారం పర్యటించనున్నారు. మరిపెడలోని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల, వసతి గృహంలో మధ్యాహ్నం 1.30 గంటలకు నిర్వహించే 40 శాతం డైట్, కాస్మెటిక్ చార్జీల పెంపు కార్యక్రమానికి ఆయన హాజరు కానున్నారు.

కురవి దేవాలయ పాలకవర్గం ప్రమాణస్వీకారం

చైర్మన్‌గా కోర్ని రవీందర్‌రెడ్డి, 14 మంది పాలకమండలి సభ్యులు



కురవిలో శ్రీవీరభద్రస్వామి దేవాలయ పాలకవర్గ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేస్తున్న పాలకవర్గం

కురవి, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి) : కురవి శ్రీవీరభద్రస్వామి దేవాలయ చైర్మన్, ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారోత్సవం శుక్రవారం ఆలయంలో నిరాడంబరంగా నిర్వహించారు. పాలకమండలి సభ్యులచే దేవాదాయశాఖ మహబూబాబాద్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఆర్.సమత ప్రమాణస్వీకారం చేయించారు. మహాశివరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన ఫెస్టివల్ కమిటీనే పూర్తిస్థాయి పాలకవర్గంగా కొనసాగించారు. సంవత్సరం పాటు పాలకమండలి విధులు నిర్వహించనుంది. చైర్మన్‌గా నేరడ గ్రామానికి చెందిన కోర్ని రవీందర్‌రెడ్డి నియమితులయ్యారు. ధర్మకర్తలుగా బాలగాని శ్రీనివాస్, కుదురుపాక ఉప్పలయ్య, బందెల సంజీవరెడ్డి, దొంగల జనార్ధన్‌రెడ్డి, దారావత్ రజిత, గద్దెల బిక్షపతి, చిన్నం గణేష్, ప్రొద్దుటూరి సత్యనారాయణ, భూక్య సక్రు, గుగులోతు సోమ్లు, వెంపటి శ్రీను, తెగుళ్ల వెంకటేష్, కాసుల మల్లికార్జున్, అర్చక ధర్మకర్తగా రెడ్యాల శ్రీనివాస్ ప్రమాణస్వీకారం చేశారు. ఈవో సత్యనారాయణ, మహబూబాబాద్ ఏఎంసీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, మండల పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం, గార్లపాటి వెంకట్‌రెడ్డి, బండి వెంకట్‌రెడ్డి, నూకల వేణుగోపాల్‌రెడ్డి, అవిరె మోహన్‌రావు, కాలం రవీందర్‌రెడ్డి, ఎన్.రాజేందర్‌కుమార్, మేక దామోదర్‌రెడ్డి, రామునాయక్, వద్దుల సురేందర్‌రెడ్డి, బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సిబిల్ స్కోర్ తగ్గకుండా చూసుకోవాలి

జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్



చిల్కోడులో మాట్లాడుతున్న శ్రీనివాస్

డోర్నకల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలకు దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులు గతంలో తీసుకున్న రుణాల సిబిల్ స్కోర్‌ను 600 పాయింట్లు తగ్గకుండా చూసుకోవాలని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం చిల్కోడులో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం బ్యాంకు నిబంధనల మేరకే లబ్ధిదారులకు రుణాల మంజూరు చేస్తామన్నారు. లబ్ధిదారులు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో సెర్ప్ ఏపీఎం శంకర్‌నాయక్, చిల్కోడు పంచాయతీ కార్యదర్శి కృష్ణప్రసాద్, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి వీరభద్రరావు, ఏపీవో పార్థసారథి, పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం



మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని పాతబజారులో గల పలు కాలనీల్లో శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు టౌన్-1 ఏఈ సంగీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ మార్కెట్, మునిసిపాలిటీ ఏరియా, మదర్‌థెరిస్సా సెంటర్, హస్తినాపురం కాలనీ, బస్టాండ్ ఏరియా, రాంచంద్రాపురం కాలనీ, ఎన్టీఆర్‌స్టేడియం, బుక్కబజారులో కరెంట్ ఉండదని చెప్పారు. శ్రీవేణుగోపాలస్వామి దేవాలయం ఏరియా, హన్మంతునిగడ్డ, వెల్పుల సత్యనారాయణ, రెడ్యానాయక్, ఆర్టీసీ కాలనీలో చెట్లకొమ్మల తొలగింపు, సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

8

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వేను పారదర్శకంగా చేయాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వేను క్షేత్రస్థాయిలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహిస్తూ, త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. జిల్లా కేంద్రం నుంచి శుక్రవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వేపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలనలో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వచ్చిన దరఖాస్తులను మొబైల్ యాప్ ద్వారా అప్‌లోడ్ చేస్తున్న సర్వేను సజావుగా నిర్వహించాలన్నారు. దరఖాస్తులన్నింటిని ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్ ద్వారా గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు, మునిసిపాలిటీల్లో వార్డు అధికారులు పరిశీలించేందుకు వారికి సంబంధిత లాగిన్స్ ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పటికే జిల్లాలో 487 గ్రామ పంచాయతీల్లో, 82 మునిసిపల్ వార్డుల్లో ఇందిరమ్మ కమిటీలు వేశామని, వారిని సైతం పంచాయతీ కార్యదర్శులతో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలనలో భాగస్వాములు చేస్తున్నామని తెలిపారు. దరఖాస్తుదారు ప్రభుత్వ సూచనల ప్రకారం బీపీఎల్‌కార్డు, వర్గం, ప్రస్తుత నివాస గృహానికి సంబంధించిన పూర్తి వివరాలు, కులం, చిరునామా, అన్ని వివరాలతో పాటు ప్రస్తుతం ఉన్న ఇంటి వద్ద తీసుకున్న ఫొటో, కొత్తగా నిర్మించతలపెట్టిన స్థలం, దానికి సంబంధించిన పూర్తి వివరాలను మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారని తెలిపారు.

మహబూబాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు 5,748 దరఖాస్తులను ప్రభుత్వానికి సమర్పించామని, మిగతా ఫారాలను పరిశీలిస్తున్నామని అద్వైత్‌కుమార్‌సింగ్ చెప్పారు. సర్వే చేస్తున్న క్రమంలో అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వం తీసుకున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంపై హర్షం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామ, పట్టణ, వార్డులస్థాయిలో చేస్తున్న సర్వేనుఅదనపు కలెక్టర్ కె. వీరబ్రహ్మచారి పర్యవేక్షిస్తారని, జిల్లా కేంద్రంలో గృహ నిర్మాణ విభాగం సిబ్బంది పని చేస్తున్నారని వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం అమలుకు జిల్లా యంత్రాంగం పక్కాగా ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు.

డైట్, కాస్మెటిక్ చార్జీల పెంపు కార్యక్రమాన్ని నిర్వహించాలి..

వసతి గృహాల్లో శనివారం జరిగే 40 శాతం డైట్, కాస్మెటిక్ చార్జీల పెంపు కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశామని అద్వైత్‌కుమార్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేకాధికారులు, సంబంధిత అధికారులు, సిబ్బంది కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సన్నాహాలు చేశారని తెలిపారు. అందులో భాగంగా అధికారులంతా వసతి గృహాల్లో ఏర్పాట్లను పరిశీలించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చే ముఖ్యఅతిథులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు ఆహ్వానాలు పంపించామన్నారు.

జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలి : డీఎంహెచ్‌వో

నెహ్రూసెంటర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించి, జాతీయ కార్యక్రమాల్లో జిల్లాను రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలపాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి గుండాల మురళీధర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐడీవోసీలోని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో శుక్రవారం జాతీయ కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ కార్యక్రమాలైనా మెటర్నల్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రాం, చైల్డ్‌హెల్త్ ఇమ్యూనిజేషన్, అసంక్రమిత వ్యాధుల ప్రోగ్రాం, నేషనల్ మలేరియా ప్రోగ్రాం, నేషనల్ టిబెర్క్యూలోసిస్ కంట్రోల్ ప్రోగ్రాం, వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం, లెప్రసీప్రోగ్రాంతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలని, సీజేరియన్‌లు తగ్గించాలని సూచించారు. గర్భిణీలను 12 వారాల్లో నమోదు చేయాలన్నారు. రక్తహీనత ఉన్న వారిని గుర్తించి ఐరన్ అండ్ ఫోలిక్‌యాసిడ్ మాత్రలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో ప్రమీల, అధికారులు సుధీర్‌రెడ్డి, సారంగం, నాగేశ్వర్‌రావు, లక్ష్మీనారాయణ, విజయ్‌కుమార్, శ్రావణ్‌కుమార్, కెవి.రాజు, గీత, రామకృష్ణ, సౌమిత్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గుండాల మురళీధర్

నేడు మానుకోటలో జాతీయ లోక్ ఆదాలత్

- కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రశర్మ

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కోర్టు ఆవరణలో శనివారం ఉదయం 10.30 గంటలకు జరిగే జాతీయ లోక్ ఆదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ సూచించారు. మహబూబాబాద్ జిల్లా కోర్టులో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

జిల్లా వ్యాప్తంగా కోర్టులో వేలసంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ఆ కేసులను సాధారణ పద్ధతిలో పరిష్కరించుకోవడం సాధ్యం కాదని చెప్పారు. అందుకోసమే మనచేతిలో అత్యున్నతమైనటువంటి ఆయుధమైన లోక్ ఆదాలత్‌ను వినియోగించుకుని, కక్షిదారులు రాజీపడి కేసులను పరిష్కరించుకోవాలన్నారు. సివిల్, భూ తగాదాలు, చెక్‌బౌన్స్, బ్యాంకు కేసులు, ఇన్సూరెన్స్‌లు, దొంగతనాల కేసులు, ట్రాఫిక్ ఈ-చాలాన్‌లాంటి కేసులతో పాటు ఇతరత్రా కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి సురేష్ పాల్గొన్నారు.

ఎస్సెస్సీ విద్యార్థుల ఉన్నతికి తొలిమెట్టు

జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి

కురవి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి అనేది విద్యార్థుల ఉన్నతికి తొలిమెట్టు డీఈవో రవీందర్ రెడ్డి అన్నారు. కురవి జడ్పీహెచ్‌ఎస్‌లో శుక్రవారం ఎస్సెస్సీ విద్యార్థులకు బుక్క వీరన్న స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలని, కురవిలో స్టడీ మెటీరియల్ అందించిన వీరన్నను అభినందించారు. విద్యార్థులు 10/10 లక్ష్యంగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. లిటిల్ టీచర్ కాన్సెప్ట్‌ను విద్యార్థుల్లో డెవలప్ చేయాలని, ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వహీద్, ఎస్.నాగయ్య, రిటైర్డ్ హెచ్‌ఎం బాదె సైదులు, జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కురవి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న రవీందర్‌రెడ్డి

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

8

రైతులకు బేడీలు వేస్తారా?

- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- అఖిల భారత రైతుకూలీ సంఘం డిమాండ్

8

ఆరోగ్య అమాత్యా.. నన్ను పట్టించుకోండి..



అయ్యా.. ఆరోగ్య మంత్రి గారూ.. మీరు బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయింది. కానీ నావైపు ఒక్కసారికూడా కన్నెత్తి చూడలేదు. ఉత్తర తెలంగాణాలోనే పెద్ద ఆస్పత్రిగా ప్రసిద్ధికెక్కిన నేను అనేక సమస్యలతో సతమతం అవుతున్నాను. ఉమ్మడి వరంగల్‌జిల్లాతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్ నుంచి కూడా ఎంతో మంది వైద్యం కోసం వస్తుంటారు. కానీ అరకొర సౌకర్యాలతో నా ఘనచరిత్ర మసకబారుతోంది. రోగుల సంఖ్య పెరుగుతున్నా.. పడకల సంఖ్య పెరగడం లేదు. కనీసం పూర్తి స్థాయి సూపరింటెండెంట్‌ను కూడా నియమించలేదు. దీంతో రోగులకు అందించే వైద్య సేవలను పర్యవేక్షించే వారు లేరు. ఇక వైద్య ఆరోగ్య శాఖలో జరిగిన బదిలీలు నా సేవలను మరింత దిగజార్చాయని అందరూ అంటున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిపోయే వైద్యులు నామమాత్రంగా సేవలు అందిస్తున్నారని రోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. మరోవైపు రోగనిర్ధారణలో కీలకమైన వైడల్ టెస్టులు, ఎక్స్‌రే తీసే మిషన్లు పనిచేయకపోవడం వారికి పెద్ద శాపంగా మారింది. చివరకు పేద రోగులు నన్ను అసహ్యించుకునే పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం నాపై దృష్టి పెట్టి గతంలో మాదిరిగా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా.. నా ఘన చరిత్రను కాపాడేలా.. చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

ఇట్లు
ఎంజీఎం ఆస్పత్రి,
వరంగల్ మెడికల్, ఆంధ్రజ్యోతి

క్రైం వార్తలు

మానుకోటలో వ్యక్తి అదృశ్యం



పాపయ్య (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర బజారుకు చెందిన దాసరి పాపయ్య కన్పించడంలేదని టౌన్ సీఐ దేవేందర్ శనివారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. వేంకటేశ్వరబజారుకు చెందిన దాసరి పాపయ్య గత నాలుగు రోజుల క్రితం కుటుంబసభ్యులకు ఎవరికి చెప్పకుండా ఇంటినుంచి వెళ్లిపోయినట్లు చెప్పారు. నాటి నుంచి పాపయ్య ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇండ్ల వద్ద ఆరా తీసినట్లు చెప్పారు. ఎక్కడ ఆచూకీ లభించకపోవడంతో మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పాపయ్య కుటుంబసభ్యులు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉరేసుకుని వృద్ధురాలి ఆత్మహత్య

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం శివారు గుండ్లకుంట కాలనీకి చెందిన జాకోజు ధనమ్మ (70) వృద్ధురాలు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు టౌన్ సీఐ దేవేందర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. గుండ్లకుంట కాలనీకి చెందిన ధనమ్మకు భర్త, పిల్లలు లేకపోవడంతో ఒంటరిగానే జీవనం గడుపుతోంది. గత కొద్దిరోజులుగా అనారోగ్యానికి గురికావడంతో అదే కాలనీకి చెందిన తనచెల్లి సరోజన రోజు వచ్చి అన్నం తెచ్చిఇచ్చి వెళ్లేది. శుక్రవారం మధ్యాహ్నం సరోజన అన్నం తీసుకుని వచ్చే సరికి అక్క ధనమ్మ ఉరివేసుకుని కన్పించింది. దీంతో వెంటనే సరోజన డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి చెల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆటోను ఢీకొన్న గేదె : ఒకరికి తీవ్ర గాయాలు

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం శివారు మహర్షి విద్యాలయ సమీపంలో ఓ ఆటోను గేదె ఢీకొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. కేసముద్రం నుంచి మహబూబాబాద్‌కు వస్తున్న ఆటోలో ఆరుగురు ప్రయాణికులు ఉన్నారు. ఆటో మహర్షి స్కూల్ సమీపంలోకి రాగానే ఒక్కసారిగా అటుగా వచ్చిన గేదె వెళ్తున్న ఆటోను బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న కేసముద్రం విలేజ్‌కు చెందిన దర్శనం సాయిలుకు తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వీరందరిని 108 ద్వారా జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

ఎదురెదురుగా బైక్‌లు ఢీ : ఇద్దరికి తీవ్ర గాయాలు

దంతాలపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెద్దముప్పారం-దంతాలపల్లి ప్రధాన రహదారిపై గల తూర్పుతండా శివారు దుబ్బతండా స్టేజీ వద్ద శుక్రవారం జరిగిన ఎదురెదురు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. తొర్రూరు మండలం చిన్నవంగ గ్రామ శివారు వంపు తండాకు చెందిన దేవేందర్ తూర్పుతండా శివారు రేఖ్యాతండా నుంచి దంతాలపల్లి వైపు వెళ్లుతున్న క్రమంలో, దంతాలపల్లి వైపు నుంచి వస్తున్న మరో బైకిస్టు మాలోతు సుమన్ బైక్‌లు ఎదురెదురు ఢీకొనడంతో వారికి తీవ్ర గాయాలు అయ్యాయి. కాగా, వారిని స్థానికులు హుటాహుటీన ప్రైవేటు వాహనంలో చికిత్స నిమిత్తం తొర్రూరుకు తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉక్కు ఆశలు.. ఆవిరేనా?

ఎండమావిగా బయ్యారం ఐరన్‌ఓర్ కర్మాగారం

కేంద్ర ప్రభుత్వ ప్రకటనతో ఏజెన్సీలో తీవ్ర నిరాశ

పోరాటాలకు సిద్ధమవుతున్న సాధన కమిటీ



బయ్యారంలో వెలికితీసిన ఇనుప ఖనిజం (ఫైల్)

బయ్యారం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బయ్యారం మండలంలో ప్రభుత్వ రంగ సంస్థ ఉక్కు కర్మాగారం ఏర్పాటుపై ఆశలు ఆవిరైనట్టేనా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అందుకు తాజాగా కేంద్రం పార్లమెంట్ వేదికగా చేసిన ప్రకటన అందరినీ నిరాశకు గురిచేసింది. దశాబ్ద కాలంగా సర్వేలతో కాలయాపన చేస్తూ వచ్చిన కేంద్రప్రభుత్వం స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు సాధ్యం కాదని పేర్కొనడంతో స్థానికంగా ఆగ్రహావేశాలు వెల్లువుకుతున్నాయి. ఎండమావిగా మారిన ఉక్కు కర్మాగారాన్ని సాధించుకునేందుకు సాదన కమిటీ పోరాటాలకు సిద్ధమవుతోంది.

ఉద్యమానికి ఉత్ప్రేకరంగా..?

'బయ్యారం ఉక్కు.. తెలంగాణ హక్కు..' అంటూ మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటాలకు ఉత్ప్రేరకంగా మారిన బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై నాడు యూపీఏ ప్రభుత్వం స్పందించింది. ఈ అంశాన్ని రాష్ట్ర పునర్విభజన చట్టంలో పొందుపరిచ్చింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014 13వ షెడ్యూల్‌లో బయ్యారం మండలంలో స్టీల్ ఆథారటీ ఆఫ్ ఇండియా (సెయిల్) ఆధ్వర్యంలో రూ.36వేల కోట్ల వ్యయంతో ఉక్కు ఫ్యాక్టరీ నెలకొల్పుతామంటూ విభజన చట్టంలో పేర్కొన్న విషయం తెలిసిందే. కానీ, నేటికి దశాబ్ద కాలం గడిచినా కార్యరూపం దాల్చకపోవడంతో ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు దక్కక యువకులు, నిరుద్యోగులు తల్లడిల్లుతున్నారు. అంతేకాక విభజన చట్టానికి భిన్నంగా బయ్యారంలో ఉక్కు కర్మాగారం నెలకొల్పడం సాధ్యం కావడంలేదని, ఖనిజం నాణ్యత లేదంటూ ఇటీవల లోక్‌సభలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటించడంతో ఉక్కుకర్మాగారం ఆశలు అడుగంటాయి. దీంతో స్థానికంగా తీవ్ర ఆవేదన నెలకొంది. కేవలం సమీక్షలు, సర్వేల పేరుతో కాలయాపన మినహా కర్మాగారం ఏర్పాటుకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

దాదాపు 30 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్న ఆశతో దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న స్థానిక ప్రజానీకానికి తాజా ప్రకటనతో మింగుడు పడటంలేదు. ఓ పక్క విశాఖ ఉక్కు ఫ్యాక్టరీనే కేంద్రప్రభుత్వం అమ్మకానికి పెడుతుండటం.. మరోపక్క బయ్యారం కర్మాగారం సాధ్యం కాదంటూ ప్రకటన చేయటంతో పాలుపోని స్థితిలో స్థానికులున్నారు. ఇప్పటికైన కేంద్ర ప్రభుత్వం స్పందించి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకొని బయ్యారంలో ప్రభుత్వ రంగ సంస్థ ఆధ్వర్యంలో స్టీల్ ఫ్యాక్టరీ నెలకొల్పేలా చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఫ్యాక్టరీ లాభసాటి!

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీతో పోలిస్తే బయ్యారం ఉక్కు కర్మాగారం లాభసాటిగా ఉంటుందనడంలో అతిశయోక్తి లేదు. విశాఖ కర్మాగారానికి ముడి ఖనిజంతో పాటు డోలమైట్, బొగ్గు, విద్యుత్ వనరులను తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. కానీ, బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు పూర్తిస్థాయిలో ఇనుప ఖనిజం లభ్యమవుతుందని గతంలో మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ (ఎన్ఎండీసీ) గుర్తించిన సంగతి తెలిసిందే. ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాల పరిధిలో 56,690 హెక్టార్ల భూముల్లో ఇనుప ఖనిజం నిల్వ ఉన్నట్టు ఎన్ఎండీసీ గతంలో గుర్తించింది. దీంతో పాటు బయ్యారానికి 50 కిలోమీటర్ల పరిధిలోనే సింగరేణి కాలరీస్ బొగ్గు, మదారం డోలమైట్ ఖనిజం, మూడు జిల్లాల పరిధిలో ఇనుపఖనిజం లభ్యం కావడంతో పాటు అత్యంత సమీపాన రైలు మార్గం, విద్యుత్, నీటి సౌకర్యాలు అందుబాటులో ఉండటం, భూమి సైతం సమృద్ధిగా ఉండటం లాంటి సానుకూల అంశాలు ఉన్నా కేంద్రప్రభుత్వం విముఖత చూపటం పట్ల తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాక బయ్యారంలో ఉక్కు కర్మాగారానికి ముడి ఇనుప ఖనిజాన్ని సమీపంలోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని జగదల్‌పూర్ ఏరియా బైలడిల్లా నుంచి 180 కిలోమీటర్ల రైలు మార్గం ఏర్పాటు చేసుకొని దిగుమతి చేసుకొనే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

సెయిల్ వెనకడుపై విస్మయం..

తెలంగాణ ప్రజాప్రతినిధులు ప్రధానమంత్రిని, కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులను ఎన్ని పర్యాయాలు కలిసినా వారిమొర అరణ్యరోధనగానే మారింది. జీయాలిజికల్ సర్వే ఆఫ్ ఇండియా, సెయిల్, సింగరేణి, కేంద్ర పరిశ్రమల శాఖ మెకాన్ సంస్థలు సర్వేలు, చేయడం ఫ్యాక్టరీ ఏర్పాటుకు డీపీఆర్‌లు రూపొందించినా సెయిల్ కర్మాగారం నెలకొల్పడానికి వెనుకడుగు వేయటం నాణ్యత తక్కువ ఉందంటూ సాకులు చెప్పడం పట్ల విస్మయం వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే తాజాగా పార్లమెంట్ వేదికగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కూడా సెయిల్ నిర్ణయాన్ని బలపరిచేలా ఉక్కు ఫ్యాక్టరీ నెలకొల్పడం సాధ్యం కాదంటూ ప్రకటించడం ఈ ప్రాంత వాసుల్లో తీవ్ర నిరాశ, నిస్పృహలు వ్యక్తమవుతున్నాయి. నిజానికి బయ్యారం ఇనుప ఖనిజం తక్కువ నాణ్యత కలిగి ఉంటే గతంలో ప్రైవేట్ సంస్థలు, వ్యక్తులు బయ్యారం ఇనుప ఖనిజం కోసం ఎందుకు వెంపర్లాడారాని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలు బయ్యారం ఇనుప ఖనిజం కోసం అర్రులు చాస్తుండగా.. సెయిల్ ఎందుకు వెనకడుగు వేస్తుందన్న ప్రశ్నలు చర్చనీయాంశమైయ్యాయి.

రూ. 500 కోట్ల ఖనిజం తరలింపు..!

2004 నుంచి 2009 వరకు దాదాపు ఐదేళ్ల పాటు బయ్యారం ప్రాంతం నుంచి ప్రైవేట్ సంస్థలు సుమారు రూ.500 కోట్లు విలువ చేసే ఇనుప ఖనిజాన్ని తరలించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే నాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబీకులు రక్షణ స్టీల్స్ పేరుతో మూడు జిల్లాల పరిధిలో ఇనుప ఖనిజం ఉన్న దాదాపు రెండు లక్షల ఎకరాల భూములు ఎందుకు కేటాయింపజేసుకున్నారని? ఎందుకు కృష్ణా జిల్లా జగ్గయ్యపేటకు లక్షలాది టన్నుల ఖనిజ సంపదను తరలించుకుపోయారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ ఫ్యాక్టరీ నిర్మాణంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 30వేల మందికి ఉపాధి లభిస్తుందన్న ఆశతో ఉక్కు కర్మాగారం కోసం స్థానికులు ఎదురు చూస్తున్నారు. కేంద్రం వెనుకడుగు వేయటంతో ప్రైవేట్ రంగ ఉక్కు ఉత్పాదక సంస్థలు బయ్యారంలో ఉక్కు కర్మాగారం నెలకొల్పేందుకు ఆసక్తి కనబరుస్తున్నట్టు సమాచారం. గతంలో జిందాల్ లాంటి సంస్థల ప్రతినిధులు బయ్యారం ఖనిజ సంపదను పరిశీలించి, వెళ్లడమే అందుకు ఉదాహరణ. అంతేకాక ఇటీవల సైతం రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం బయ్యారం ఇనుపఖనిజ సంపద కర్మాగారం అంశాలపై నివేదిక కోసం సంబంధిత శాఖలను కోరినట్లు తెలిసింది.

ఉక్కు సాధన పోరాటాన్ని ఉధృతం చేస్తాం



కేంద్రప్రభుత్వ నిర్ణయం సమంజసం కాదు. కుంటి సాకులతో ఉక్కు పరిశ్రమను నిరాకరిస్తోంది. ఉక్కు కర్మాగారం కోసం మా పోరాటాన్ని ఉధృతం చేస్తాం. వనరులు పుష్కలంగా ఉన్నా బయ్యారంలో స్టీల్ ఫ్యాక్టరీ సాధ్యం కాదంటూ రాతపూర్వకంగా పేర్కొనడం హాస్యాస్పదం. విభజన చట్టంలో ముడి ఖనిజ నిల్వల ప్రస్తావనే రాలేదు. ఉక్కుపరిశ్రమ స్థాపనకు ఖనిజ నిల్వలకు సంబంధమే లేదు. ముడిఖనిజ నిల్వలు ఏం ఉన్నాయని విశాఖలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేశారు. అక్కడి కంటే బయ్యారానికే తక్కువ దూరం నుంచి ఖనిజాన్ని దిగుమతి చేసుకోవచ్చు. బయ్యారం ఉక్కు పరిశ్రమ తెలంగాణ ప్రజలు సాధించుకున్న చట్టబద్ధమైన హక్కు. అది సాధ్యం కాదని ప్రకటించే హక్కు, అధికారం కేంద్ర ప్రభుత్వానికి, కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి లేదు. విభజన హామీ అమలుకు కృషి చేయాల్సిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఫ్యాక్టరీ ఏర్పాటు సాధ్యం కాదని పార్లమెంట్ వేదికగా ప్రకటడించడం బాధ్యతా రాహిత్యమే. కేంద్రం స్పందించి బయ్యారంలో స్టీల్ పరిశ్రమ నెలకొల్పకపోతే తగిన మూల్యం చెల్లించుకోకతప్పదు.

-గౌని ఐలయ్య, ఉక్కు పరిశ్రమ సాధన కమిటీ కన్వీనర్

సరస్వతీ పుష్కరాలకు సమగ్ర ఏర్పాట్లు చేయండి

భక్తులకు ఇబ్బందులు తలెత్తొద్దు..

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



రివ్యూలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

మహదేవపూర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో అంతర్వాహినిగా ప్రవహించే సరస్వతీ నదీ పుష్కరాలకు సమగ్ర ఏర్పాట్లు చేయాలని, వచ్చే ఏడాది జరిగే ఈ పుష్కరాలకు రాష్ట్రంతో పాటు పక్క రాష్ట్రం భక్తులు కూడా వస్తారని, వారికి ఇబ్బందులు లేకుండా చూడాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంతి కొండా సురేఖ ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వచ్చే ఏడాది పుష్కరాలు రానున్న నేపథ్యంలో నిర్వహణకు అధికారులు అంచనా నివేదికలు తయారు చేసి పంపాలన్నారు. దేవాదాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్, సమాచార, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ తదితర శాఖలు అవసరమయ్యే అంచనాలు తయారు చేయాలన్నారు. స్నాన ఘట్టాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

గత పుష్కరాలకు 30వేల మంది భక్తులు వచ్చారని, ఈసారి 50వేల మంది భక్తులు వచ్చే అవకాశమునట్టు అధికారులు మంత్రికి వివరించారు. ఇందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయాలని, పారిశుధ్య నిర్వహణకు ప్రస్తుతం ఉన్న వారితో పాటు పుష్కరాలు జరిగే కాల పరిమితికి ప్రత్యేకంగా కొందరిని నియమించాలని కలెక్టర్, ఈవోను ఆదేశించారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా ఇతరత్రా పనులన్నీ సక్రమంగా ఉండాలన్నారు. 12 రోజుల పాటు జరిగే ఈ పుష్కరాలకు ప్రతీ రోజు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయమై పనిచేయాలని, ఏమైనా ఇబ్బందులు తలెత్తితే తనకు నేరుగా తెలియజేయాలన్నారు. ఈ రివ్యూలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్, శ్రీధర్, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ ఎండీ ప్రకాష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే, కాళేశ్వరం ఆలయ ఈవో మారుతి తదితరులు పాల్గొన్నారు.



మల్యాలలోని బోడ సుందర్‌కు చెందిన మిర్చితోటను పరిశీలిస్తున్న వైస్‌ఛాన్సలర్ రాజిరెడ్డి

'ఉద్యాన పంటలకే మంచి భవిష్యత్'

మహబూబాబాద్ అగ్రికల్చర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో ఉద్యాన పంటలకే మంచి భవిష్యత్ ఉంటుందని శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ దండె రాజిరెడ్డి అన్నారు. మహబూబాబాద్ మండలం మల్యాలలోని జెన్నారెడ్డి వెంకట్‌రెడ్డి ఉద్యానపరిశోధన స్థానంలోని జామ, మామిడి, సపోట, నిమ్మ కరోనా, జన్యు సంపదను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తోటలోని కొన్ని జామ నూతన (జామ మదర్‌బ్లాక్) మొక్కలను వైస్ చాన్సలర్ నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పరిశోధన స్థానంలో జరుగుతున్న పరిశోధనను, వాటి ఫలితాలను శాస్త్రవేత్తల ద్వారా తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వైస్‌చాన్సలర్ విలేకరులతో మాట్లాడుతూ ఉద్యాన పంటలకే ప్రాముఖ్యత ఉందని, ఆ పంటలపై జరుగుతున్న పరిశోధనల విషయాలను రైతులకు ఎప్పటికప్పుడు చేరవేస్తున్నట్లు చెప్పారు. కాగా, మల్యాల ఉద్యాన కళాశాలలో బీఎస్సీ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ ఉద్యాన విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందని, విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకుడు డాక్టర్ లక్ష్మీనారాయణ, జిల్లా ఉద్యానశాఖ అధికారి జినుగు మరియన్నతో పాటు జేవీఆర్, కేవీకే శాస్త్రవేత్తలు, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

కొత్తగూడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) :ఈనెల 15న(రేపు) భూక్య జంపన్న ట్రస్ట్ ఆధ్వర్యంలో కొత్తగూడలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు భూక్య జంపన్న తెలిపారు. ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరంలో కంటి, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కంటి లోపం ఉన్నవారికి ఉచితంగా కంటి ఆపరేషన్‌లు చేయిస్తామని పేర్కొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

- టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు డోలి సత్యనారాయణ



సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న డోలి సత్యనారాయణ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అమలు చేస్తున్న ప్రతీ పథకాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్తున్న సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని తెలంగాణ జనసమితి (టీజేఎస్) జిల్లా అధ్యక్షుడు డోలి సత్యనారాయణ అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని, క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ మహబూబాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేపట్టిన సమ్మె శుక్రవారానికి 8వ రోజుకు చేరుకుంది. ఈ శిబిరాన్ని సందర్శించి వారికి సంఘీభావం ప్రకటించిన ఆయన మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో సమయపాలన పాటిస్తూ విద్యారంగ బలోపేతానికి కృషి చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌ను నెరవేర్చాలని కోరారు.

పీఆర్టీయూ-టీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి మిర్యాల సతీష్‌రెడ్డి మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా మండల విద్యాశాఖ కార్యాలయాలకు, ప్రభుత్వ పాఠశాలలకు అనుసంధానకర్తలుగా విధులు నిర్వహిస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులతో ప్రభుత్వం చర్చించి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో వీరన్న, ఖాదర్, ఉదయ్, నవీన్, ప్రభావతి, మంజుల, మున్నీ, భవాని, సరస్వతి, నీలిమా, విజయలక్ష్మీ, మాధురి, ప్రభాకర్, వీరయ్య, జ్యోతి, వీరన్న, ఉప్పలయ్య, రవీందర్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా టీటీఎఫ్, టీఎస్-యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు.

పనిచేయని ఎక్స్ రే యంత్రాలు

దురుసుగా సమాధానం చెబుతున్న సిబ్బంది

వరంగల్ మెడికల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణలో పేదల ఆస్పత్రిగా ప్రసిద్ధికెక్కిన ఎంజీఎంలో ఎక్స్‌రే యంత్రాలు పని చేయడం లేదు. వివిధరకాల రోగ నిర్ధారణ కోసం ఎక్స్‌రే తప్పనిసరిగా అవసరం అవుతుంటాయి. ఇక ఆర్థో విభాగంలోనైతే ఎక్స్‌రే లేనిదే ఎలాంటి చికిత్స అందించడం వీలుకాదు. రోగ నిర్ధారణలో ఇంత ప్రతిష్టాత్మ కంగా మారిన ఈ పరీక్షలకు సంబంధించిన యం త్రాలు పనిచేయడం లేదు.

రోజూ వందలాదిమంది రోగులతో కిటకిటలాడే ఎంజీఎం ఆస్పత్రి రూమ్ నెంబరు 92లో ఈ మిషన్లు ఉన్నాయి. శుక్రవారం ఉదయం రోగులు ఈ పరీక్షల కోసం రాగా, అక్కడ పనిచేసే సిబ్బంది దురుసుగా ప్రవర్తించారని రోగులు వాపోతున్నారు. కనీసం ఎప్పటివరకు యంత్రాలు మరమ్మతు అవుతాయని కూడా చెప్పడం లేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధి కారులు ఇప్పటికైనా స్పందించి ఎక్స్‌రే సేవలను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

తాడ్వాయి - మంగపేట అడవుల్లోనే పెద్దపులి

పాదముద్రలను పరిశీలించిన కాళేశ్వరం జోన్ సీసీఎఫ్ ప్రభాకర్

పరిసర గ్రామాల్లో భయంభయం



తాడ్వాయి అడవుల్లో పెద్దపులి పాదముద్రలను పరిశీలిస్తున్న సిబ్బంది

తాడ్వాయి/మంగపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నాలుగురోజుల క్రితం మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి ములుగు జిల్లాలోకి ప్రవేశించిన పెద్దపులి తాడ్వాయి - మంగపేట అడవుల్లో సంచరిస్తోంది. అది రెండు రోజులుగా తాడ్వాయి మండలం పంబాపూర్-దామెరవాయి, మంగపేట మండలం కొత్తూరు మొట్లగూడెం పరిసర అటవీ ప్రాంతంలో తిరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు. మూడు రోజుల పాటు సుదీర్ఘ ప్రయాణం చేసిన పులి శుక్రవారం ఒకే ప్రాంతంలో ఉన్నట్టు స్పష్టమవుతోంది. పంబాపూర్-దామెరవాయి, కొత్తూరు మొట్లగూడెం మధ్యలోని గుట్టలు, వాగుల వెంట సంచరిస్తున్నట్టు అటవీశాఖ అధికారులు గుర్తించారు. కాళేశ్వరం జోన్ సీసీఎఫ్ ప్రభాకర్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది శుక్రవారం అడవుల్లోకి వెళ్లారు.

నీటి తావుల వద్ద పులి పాదముద్రలను వారు గుర్తించారు. ఒకరోజు ముందే పులి అక్కడికి వచ్చివెళ్లినట్టు నిర్ధారించుకున్నారు. ఇప్పటికే ఆరు ప్రత్యేక బృందాలు పులి కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండగా రెండు రోజులుగా పంబాపూర్ అడవుల్లోనే మకాం వేయడంతో అప్రమత్తమయ్యారు. అయితే శుక్రవారం సాయంత్రం పక్కనే ఉన్న మంగపేట మండల పరిధిలోకి వచ్చే కొత్తూరు మొట్లగూడెం అడవుల్లో పులి సంచరిస్తున్నట్లు అక్కడి ప్రజలు భయాందోళన వ్యక్తం చేశారు. చీపురుపుల్లల సేకరణకు అడవిలోకి వెళ్లిన ఓ వృద్ధుడు పొట్టయ్యకు గండిఒర్రె ప్రాంతంలో పెద్దపులి తారసపడడంతో భయంతో వణికిపోయిన ఆయన గ్రామంలోకి పరుగుపెట్టాడని స్థానికులు చర్చించుకుంటున్నారు. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు వాస్తవాలను పరిశీలిస్తున్నారు. పులి సంచరిస్తోందని, ఒంటరిగా అడవిలోకి, పొలాల వద్దకు వెళ్లవద్దంటూ కొత్తూరు మొట్లగూడెం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చాటింపు వేయించారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2427	2080
పల్లికాయ (సూక)	4320	4000
పల్లికాయ (పచ్చిది)	5850	5500
కందులు	-	-
పెసళ్లు	5666	5000
పత్తి	7010	5800
పసుపు (కాడి)	10899	10000
పసుపు (గోల)	10729	10500
తేజ మిర్చి	12000	9000
తేజ మిర్చి (కొత్తది)	15561	12000
తేజ ఏసీ	15500	14000
వండర్‌హాట్ ఏసీ	13000	11000
యూఎస్341ఏసీ	14500	11000
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	7000	3000

- వరంగల్ వ్యవసాయం

పత్రికి పాటంటే ప్రాణం..

- 5వేల చరణాలతో అతి పెద్ద గేయం
- 50 గంటల ఆడియోతో ప్రపంచ రికార్డు
- ఔరా అనిపిస్తున్న గాయకుడు, కళాకారుడు కుమారస్వామి


సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పాట పాడుతున్న పత్రి (ఫైల్)
పాట పాడుతున్న పత్రి కుమారస్వామి

వరంగల్ కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పాటలంటే ఆయనకు ప్రాణం. జానపద గేయాలతో ప్రారంభమై సామాజిక సమస్యలు.. ఆధ్యాత్మిక భావనలపై అందరినీ హత్తుకునే పాటలను పాడుతూ ప్రపంచంలోనే ఎవరూ రాయని ఎవరూ పాడని అతి పెద్ద పాటను పాడి వార్తల్లోకి ఎక్కిన వ్యక్తి పత్రి కుమారస్వామి. 5 వేల పదాలతో 50 గంటల పాటు పాట పాడి ఆ ఆడియోతో ప్రపంచ రికార్డును సాధించారు. కళాకారుడిగా ప్రస్థానం ప్రారంభించిన నగరానికి చెందిన పత్రి కుమారస్వామి ఆయుర్వేద వైద్య చిట్కాలను శోధన చేస్తూ పాత్రికేయ వృత్తిని ప్రారంభించి గాయకుడిగా తన జీవనాన్ని కొనసాగిస్తున్నారు.

విద్య, కళాకారుడిగా ప్రస్థానం

వరంగల్ కాశీబుగ్గ ప్రాంతానికి చెందిన పత్రి కట్టయ్య, మల్లికాంబ దంపతుల కుమారుడు కుమారస్వామి చిన్నతనం నుంచే కళను నేర్చుకుంటూ విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. సీకేఎం కళాశాలలో బీఎస్సీ డిగ్రీ పూర్తి చేసి లక్ష్మీ ఆయుర్వేద కళాశాలలో ఆయుర్వేద శోధనతో విద్య పూర్తి చేసి కాకతీయ యూనివర్సిటీలో ఎంసీజే చదివారు. హైదరాబాద్‌లోని ఆకాశవాణి కేంద్రంలో సంగీత జానపద ఉత్సవంలో ఏ - గ్రేడ్ ఆర్టిస్టుగా 2003లో ఎంపికయ్యా^రు. ఉమ్మడి రాష్ట్రంలో జానపద సంగీత పోటీలలో ఏ - గ్రేడ్ కళాకారుడిగా కుమారస్వామి ఒక్కరే ఎంపికయ్యారు. జిల్లా, రాష్ట్రస్థాయి జానపద పాటల పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు.

యాంకర్‌గా, గాయకుడిగా టీవీల్లో ప్రదర్శనలు..

గాయకుడిగా 35సంవత్సరాలుగా పూర్వ దూరదర్శన్, ప్రస్తుత యాదగిరి ఛానల్‌తో పాటు ఆకాశవాణిలో వందల కొద్ది పాటలు ఆలపించారు. ప్రపంచంలో అతి పెద్ద జాతరైన మేడారం సమ్మక్క- సారలమ్మ జాతరలో ప్రత్యక్ష ప్రసారంలో భాగంగా అమ్మవార్ల పాటను దూరదర్శన్‌లో పాటపాడి అందర్నీ మంత్రముగ్ధుల్ని చేశారు. ఇక 5 వేల పదాలను పాటగా పత్రి కుమారస్వామి 50 గంటల పాటు పాడి ప్రపంచంలోనే ప్రపంచ రికార్డులో నిలిచారు. ఈ పాటను సీఎం రేవంత్ రెడ్డి ఎదుట ఆలపించి ఆయన అభినందనలు అందుకున్నారు. ఇదే కాకుండా తెలుగు రాష్ట్రాల్లో అనేక ప్రదర్శనలు నిర్వహించి పాల్గొని ప్రముఖుల మన్ననలు పొందారు. మంత్రి కొండా సురేఖతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు పత్రి ప్రదర్శనలను తిలకించి ప్రశంసించారు. 50 గంటల పాటు 5 వేల చరణాలతో రాసి పాడిన పాట అందులో ప్రతీ అక్షరం సమాజానికి ఉపయోగపడేలా రాసినట్టు పత్రి కుమారస్వామి తెలిపారు. సమాజంలో రుగ్మతలను రూపుమాపి సమాజాభివృద్ధికి తోడ్పడేలా రాసిన పత్రికి గిన్నిస్ రికార్డును అందించాలని ఆయన అభిమానులు కోరుతున్నారు.


కళాకారుడైన పత్రిని సన్మానినిస్తున్న మేయర్ గుండు సుధారాణి (ఫైల్)


వంశీ ఆర్ట్స్ వారు పత్రిని సన్మానించిన దృశ్యం (ఫైల్)

కళ

పాటల పూదోట వెంకటలక్ష్మీ


- రచయితగా, గాయకురాలిగా రాణిస్తున్న అంగన్‌వాడీ టీచర్
- ఉత్తమ రచయితగా అవార్డులు, ప్రశంసలు
- 500కుపైగా జనచైతన్యగీతాల రచన



ఢిల్లీలో అంబేద్కర్ అవార్డు అందుకుంటున్న తొట్ల వెంకటలక్ష్మీ (ఫైల్)


ఢిల్లీలో అంబేద్కర్ అవార్డు అందుకుంటున్న తొట్ల వెంకటలక్ష్మీ (ఫైల్)

నెల్లికుదురు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కడుపేదరికం.. సమాజంలో జరుగుతున్న రుగ్మతలు.. అవాంఛనీయ ఘటనలు.. చాలీచాలని వేతనాలతో జీవిస్తున్న కార్మికుల కష్టాలు.. దేశంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు.. దోపిడీల లాంటి సంఘటనలు ఆమెను కవిగా, గాయకురాలిగా మలిచాయి. అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమెను గళం వినిపించేలా పురిగొల్పాయి. ఈ క్రమంలోనే సుమారు 500కుపైగా జనచైతన్య గీతాలను రచించి ఔరా అనిపించుకుంటున్నారు నెల్లికుదురు మండలంలోని వస్రాంతండాలో అంగన్‌వాడీ టీచరుగా విధులు నిర్వహిస్తున్న తొట్ల వెంకటలక్ష్మీ. మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండల కేంద్రంలో తొట్ల వీరయ్య, చిన్నవెంకటమ్మ దంపతుల చిన్నకూతురైన వెంకటలక్ష్మీ వివాహం అనంతరం నెల్లికుదురు మండల కేంద్రంలో నివాసం ఉంటున్నారు. 20ఏళ్ల క్రితం అంగన్‌వాడీ టీచరుగా ఉద్యోగం సాధించిన ఆమెకు చిన్ననాటి నుంచి జానపద గేయాలు, గ్రామాల్లో వ్యవసాయ కూలీలు పాడేపాటలు అంటే మక్కువ. అంగన్‌వాడీలకు సరైన గుర్తింపు, వేతనాలు లేకపోవడంతో వేతనాలు పెంచాలని సమ్మెలు, ధర్నాలు ర్యాలీలు చేస్తున్న క్రమంలో ఆమె స్వయంగా పాటలు రాసి, బాణీలు కట్టి, సమ్మెలలో పాటలు పాడటం మొదలుపెట్టారు. అనంతరం తెలంగాణ ఉద్యమ సమయంలో ఆమెలో దాగిఉన్న కళ బయట కొచ్చింది. రాష్ట్రం సిద్ధించాక తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్న క్రమంలో వందలాదిగా బతుకమ్మ పాటలు రాసి పుస్తకం రచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతిరోజు విధులు నిర్వహిస్తూ తీరిక సమయంలో పాటలు రచిస్తూ ఢిల్లీలో, హైదరాబాద్‌లో పలువురి మన్ననలు, ప్రశంసలు పొందారు. ఇప్పటి వరకు 500 వరకు వివిధ రకాల జనచైతన్య గీతాలు రచించి, పుస్తకం ముద్రించింది. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై పాటలు రచించి, మహిళలలో చైతన్యం రగిలించి, నిరక్ష్యరాస్యత నిర్మూలనపై మహిళలతో నృత్యాలు వేయిస్తూ మహిళలు అన్నిరంగాలలో రాణించాలని ఉత్తేజపరుస్తూ వాగ్గేయకారిణిగా ముందుకు సాగుతున్నారు.



పలు అవార్డులు సొంతం

2015లో రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఉత్తమ సాహితీవేత్త అవార్డుతో పాటు రూ.10,116 నగదు పురస్కారం అందుకున్నారు. 2016లో ఢిల్లీలో సావిత్రిబాయి పూలే అవార్డు, 2017లో ఢిల్లీలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అవార్డు, అదే ఏడాది జిల్లాస్థాయి ఉత్తమ గాయని అవార్డు అందుకున్నారు. 2017లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల జిల్లాస్థాయిలో ప్రశంస పత్రం అందుకున్నారు.

నిరక్ష్యరాస్యత నిర్మూలనకు కృషి



పాటలు, నృత్యాలతో నిరక్షరాస్యత నిర్మూలనకు నా వంత కృషిచేస్తా. నిరక్షరాస్యతతో సమాజంలో అవాంఛనీయ ఘటనలు జరుగుతున్నాయి. ఇప్పటికీ చాలామంది ఆడపిల్లలు ఉన్నత చదువులకు నోచుకోవడం లేదు. చిన్న తనంలోనే వివాహాలు చేసుకొని ఉజ్వల భవిష్యత్‌ను కోల్పోతున్నారు. మహిళ కళాబృందాన్ని ఏర్పాటు చేసి జానపద పాటలతో నృత్యాలతో బాల్యవివాహాల నివారణపై మార్పు తీసుకరావడానికి కృషి చేస్తున్నా. దాతలు ఆర్థికంగా సహకరిస్తే నేను రచించిన పాటలను ఆల్బంగా తయారు చేసి, అన్నివర్గాల ప్రజలను ఆలోచింపజేసేలా ప్రదర్శిస్తా.

- వెంకటలక్ష్మీ

అలెర్ట్

మైనర్లూ.. బండ్లు నడపొద్దు

- నగరంలో యథేచ్ఛగా మైనర్ డ్రైవింగ్
- మితిమీరిన వేగంతో ప్రమాదాల పాలవుతున్నవైనం
- తల్లిదండ్రులూ జాగ్రత్త పడాల్సిందే..



మట్టెవాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వాహనాలు నడపడమంటే.. హ్యాండిల్ పట్టుకోవడమో.. స్టీరింగ్ తిప్పడమో వస్తే సరిపోదు. రోడ్డురవాణా శాఖ నిబంధనలు తెలిసిఉండాలి. లేదంటే ప్రమాదాలకు గురవక తప్పదు. ఇక మైనర్ డ్రైవింగ్ అయితే పోలీసులు తీసుకునే చర్యలను ఎదుర్కో వాల్సిందే. నగరంలో రోజురోజుకూ వాహనాలు నడిపే పిల్లల సంఖ్య ఎక్కువవుతోంది. పదేళ్ల నుంచి 15 ఏళ్ల బాలబాలికలు కార్లు, ద్విచక్రవాహనాలతో రోడ్లపైకి దూసుకువెళ్తున్నారు. రయ్ మంటూ డ్రైవింగ్ చూస్తూ.. రాంగ్ రూట్లలో ప్రయాణిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడుతున్నారు. వాహనాలను స్వాధీనం చేసుకొని కేసులునమోదు చేస్తున్నా అలాంటి వారిలో మార్పు రావడం లేదని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. కొందరు తల్లిదండ్రులు మైనారిటీ తీరిందా లేదా? రోడ్డు నిబంధనలు వారికి తెలుసా లేదా అనేది కూడా చూడకుండా తమ పిల్లలకు ఖరీదైన వాహనాలను కొనిస్తున్నారు. దాంతో పిల్లలు ఉత్సాహంతో మితిమీరిన వేగంతో వారు ప్రమాదాల బారిన పడి ప్రాణాలపైకి తెచ్చుకోవడంతో పాటు.. ఎదుటి వారిని కూడా ప్రమాదాలకు గురిచేస్తున్నారని పోలీసులు చెబుతున్నారు.

పిల్లల చేతికి వాహనాలు..

ప్రమాదకరమని తెలిసినా కొందరు తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇస్తున్నారు. మైనర్లు వాహనాలు నడిపితే అనర్థాలు తప్పవని పోలీస్ అధికారులు చెపుతున్నా పట్టించుకోవడం లేదు. ఫలితంగా ట్రాఫిక్ మధ్య వాహనాలు నడిపే అనుభవం లేకపోవడం, వాహనాన్ని అదుపు చేసే శక్తి సామర్థ్యాలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అంతేగాకుండా ఇటీవల ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో అనేక మంది పట్టుబడ్డారు. వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చినా డ్రైవింగ్ మాత్రం మానుకోవడం లేదన్నది అర్థమవుతోంది. మైనర్ల డ్రైవింగ్‌తో నగరంలో అనేక అనర్థాలు జరుగుతున్నాయి. రెండు నెలల క్రితం వరంగల్‌లో ఓ మైనర్ స్కూటీ నడుపుతూ అదుపుతప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. అదే విధంగా మరో బాలుడు బైక్ నడుపుతూ ఓ వృద్ధుడిని ఢీకొట్టడంతో ఆ వృద్ధుడి కాలు విరిగింది. ఈ ఘటనలో ఆ మైనర్‌కు కూడా తీవ్ర గాయాలయ్యాయి.

ఈ ఏడాది నగరంలో నమోదైన మైనర్ డ్రైవింగ్ కేసులిలా..

వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రైసిటీస్ పరిధిలో మైనర్ల డ్రైవింగ్ రోజురోజుకూ పెరుగుతోంది. వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 104 కేసులు, హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో 176, కాజీపేట పరిధిలో 17 కేసులు నమోదయ్యాయి. మొత్తంగా 297 మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదైనట్టు ట్రాఫిక్ పోలీసుల రికార్డులు చెబుతున్నాయి.

డ్రైవింగ్ చేస్తూ మైనర్లు పట్టుబడితే...

మోటార్ వెహికిల్ చట్టం ప్రకారం సెక్షన్ నంబర్ 181 కింద జరిమానా విధిస్తారు. సెక్షన్ 180కింద వాహన యాజమానికి సైతం జరిమానా విధిస్తారు. తల్లిదండ్రులపై కూడా చట్టరీత్యా చర్యలు తీసుకుంటారు. తల్లిదండ్రులు జువైనల్ జస్టిస్ బోర్డు లేదంటే కోర్టుకు, లేకపోతే పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉంటుంది.

కొత్తరకం దేశీయ పత్తి రకాల సృష్టి

వరంగల్ ప్రాంతీయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తల కృషి


పత్తి మొక్కలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త

వరంగల్ వ్యవసాయం, డిసెంబరు 13 : (ఆంధ్రజ్యోతి): వరంగల్ ప్రాంతీయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు కొత్తరకం దేశీయ పత్తి రకాల(వెరైటీ)లను సృష్టిస్తున్నారు. నీటి వసతి లేకున్నా.. పంట ఎండిపోకుండా, చీడపీడల నుంచి తట్టుకునేలా అన్ని వాతావరణ పరిస్థితుల్లోనూ అధిక దిగుబడులిచ్చేలా పత్తి రకాలను సృష్టిస్తున్నారు. ఈ రకమైన పత్తిని స్థానిక పరిశోధన కేంద్రంలో ఆరేళ్లుగా ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్నారు. మరి కొన్నాళ్ల పాటు పరీక్షిం చి అత్యుత్తమ ఫలితాలు వచ్చిన తరువాత రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఈ రకాలు రైతులకు అందుబాటులోకి వస్తే బయటి విత్తనాలు కొనే అవసరం ఉండదు. సాగు చేసిన పంట నుంచే గింజలను తీసి తిరిగి విత్తుకోవచ్చు. హైబ్రిడ్ కొత్త వంగడాల విత్తనాలను సాగు చేసే రైతులకు ఈ అవకాశం ఉండదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. తెలంగాణలో పత్తి సాగుకు అన్ని విధాలుగా అనుకూలంగా ఉంటుందని అంటు న్నారు. ఇప్పుడు అభివృద్ధి చేసే కొత్త రకాలు రైతులకు ఆమోదయోగ్యంగా ఉంటాయని చెబు తున్నారు. ఈ కొత్తరకాలను తొలుత ఈ పరి శోధన కేంద్రంలోని ఉమ్మడి ఖమ్మం, మెదక్, వరంగల్ జిల్లాలో ప్రయోగాలు చేసి దశలవారీగా రాష్ట్రమంతా విస్తరించేలా ప్రయత్నం చేస్తు న్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

- త్వరలో చేతికి రానున్న మొదటి పంట
- కనిపించని మార్కెటింగ్ జాడ
- ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలదే బాధ్యత అంటున్న అధికారులు
- ఇప్పటికీ ప్రారంభం కాని ఫ్యాక్టరీల ఏర్పాటు ప్రక్రియ
- రాష్ట్ర వ్యాప్తంగా 1.99 లక్షల ఎకరాల్లో సాగు



సాగు సరే... పరిశ్రమ ఏది?



త్రిశంకు స్వర్గంలో ఆయిల్‌పామ్ రైతులు

(ఆంధ్రజ్యోతి భూపాలపల్లి) : రాష్ట్రంలో ఆయిల్‌పామ్ మొదటి పంట చేతికొస్తోంది. అయినా పంట కోత, ఫ్యాక్టరీలకు తరలింపు, మార్కెటింగ్ వంటి అంశాలు రైతన్నలను గందరగోళానికి గురిచేస్తున్నాయి. నాలుగేళ్లుగా ప్రభుత్వం చెప్పినట్లుగా ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్, రిఫైనరీల ఏర్పాటు ఇంకా కొలిక్కి రాలేదు. దీంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్రంలో వంట నూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో 2020-21లో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆయిల్‌పామ్ సాగు విధానాన్ని తీసుకొచ్చింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 31 జిల్లాల్లో మొత్తం 1.99లక్షల ఎకరాల్లో రైతులు సాగు చేశారు. ఇందుకు ప్రభుత్వం వివిధ ఏజెన్సీలతో మొక్కల పంపిణీ మొదలుకొని రైతుల పంట కొనుగోలు వరకు ఆయా ఏజెన్సీలకే బాధ్యతలను అప్పగిస్తూ ఒప్పందం చేసుకుంది.. ఈ క్రమంలో రాష్ట్రంలోని మొత్తం 14 ఏజెన్సీలు రిఫైనరీల ఏర్పాటుకోసం అంగీకారం కుదుర్చుకుంది. అయితే మొక్కలు నాటిన మూడేళ్ల తర్వాత ఆయిల్ హార్వెస్టింగ్ జరిగే అవకాశం ఉంటుందని ముందే తెలిసినా ఇప్పటి వరకు ఆయా ఏజెన్సీలు పరిశ్రమల స్థాపించడంలో పూర్తిగా విఫలమయ్యాయి. ప్రస్తుతం భూపాలపల్లి జిల్లా సహా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 7వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ గెలలు కోతకు వచ్చినట్లు ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు.



భూపాలపల్లి జిల్లాలో సాగు చేసిన మొత్తం 3650 ఎకరాలకు ఈ ఏడాది దాదాపు 353ఎకరాల్లో మొదటి సారి ఆయిల్ పామ్ గెలలు హార్వెస్టింగ్ జరుగనున్నాయి. రైతులు, అధికారుల మాటలనుబట్టి మరో రెండు నెలల్లో ఈ పంట హార్వెస్టింగ్ పూర్తి కావాల్సి ఉంది. భూపాలపల్లి జిల్లాకు సంబందించి సువెన్ ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ రైతుల నుంచి పంటను కొనుగోలు చేయాల్సి ఉంది. ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఆ సంస్థ మొక్కలు అందజేయడం మొదలుకొని ఉత్పత్తి కొనుగోలు వరకూ బాధ్యత తీసుకోవాల్సి ఉంటుంది. రైతులకు మొక్కల సరాఫరా చేసినందుకు ఒక్కో మొక్కపై రూ. 193ను సబ్సిడీగా అందజేస్తోంది. ఈ లెక్కన ఒక్కో ఎకరాకు 57 మొక్కలకు రూ. 11,001ను ఖర్చు చేస్తోంది. జిల్లాలో మొదటిసారి ఆయిల్‌పామ్ చేతికొస్తుందని రైతులు ఆనందించే లోపు ఇంకా ఇక్కడ పరిశ్రమ ఏర్పాటుకాలేదన్నా సమాచారం ఆందోళనకు గురిచేస్తోంది. రాష్ట్రమంతటా ఇదే పరిస్థితి ఉందని తెలుస్తోంది.

పరిశ్రమల మంత్రి ఇలాకాలోనే పరిశ్రమ కరువు

పరిశ్రమల మంత్రి శ్రీదర్‌బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న భూపాలపల్లి జిల్లాలోనే ఆయిల్‌పామ్ పరిశ్రమకు మోక్షం కలగలేదు. ఓ వైపు పంట చేతికొస్తున్నా, ఒప్పందం కుదుర్చుకున్న సంస్థ పరిశ్రమ నిర్మాణాన్ని ప్రారంభించకుండా తాత్సారం చేయడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. భూపాలపల్లి జిల్లాలో రైతులు పండించే ఆయిల్‌పామ్‌ను సేకరించి రిఫైన్ చేయడం కోసం జిల్లాలోని చిట్యాల మండలం నైన్‌పాకలో రిఫైనరీని ఏర్పాటు చేయాలని తలపెట్టినా ఇప్పటికీ అక్కడ ఎలాంటి నిర్మాణాలు ప్రారంభం కాలేదు. అయితే రిఫైనరీ ఫ్యాక్టరీ నడవాలంటే కనీసం 20వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు ఉండాలని, అప్పుడే నిరంతరం దిగుబడులు వస్తే తప్ప పరిశ్రమ నడిచే పరిస్థితి ఉండదని అంటున్నారు. ప్రస్తుతం జిల్లాలో 3650 ఎకరాల్లో మాత్రమే పంట సాగు చేయగా ఇందులో ఈ ఏడాది 353ఎకరాలకు సంబంధించి మాత్రమే పంట కోతకు వచ్చే పరిస్థితి ఉంది. దీంతో సంస్థ వేచిచూసే ధోరణి అనుసరిస్తోందని తెలుస్తోంది. జిల్లాలో పరిశ్రమల స్థాపించేందుకు ముందుకు వచ్చిన సువెన్ ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పంటను కొనుగోలు చేస్తుందని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నప్పటికీ ఇప్పటి వరకు దీనిపై ఎలాంటి స్పష్టత లేకపోవడంతో రైతులను అయోమయానికి గురి చేస్తోంది. ఇదిలా ఉండగా మొదటి కోత జరిగిన 24గంటల్లోపే ఆయిల్‌పామ్ గెలలను ఫ్యాక్టరీకి తరలించాల్సి ఉంటుందని, లేని పక్షంలో నూనె శాతం తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఖమ్మం జిల్లాలో రెండు మినహా ఎక్కడా పరిశ్రమలు నిర్మాణం కాకపోవడంతో మొదటి పంటను రైతులు వదులుకోవాల్సిందేనా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.




డోర్నకల్ ఇందిరమ్మ ఇండ్ల సర్వే నిర్వహిస్తున్న మునిసిపల్ సిబ్బంది


కల్వలలో ఇళ్ల సర్వే ప్రారంభంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

'ఇందిరమ్మ' ఇళ్ల సర్వే ప్రారంభం

కేసముద్రం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో సర్వేను శుక్రవారం అధికారులు ప్రారంభించగా, కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి మాట్లాడారు. అర్హులైన వారందరికీ దశలవారీగా ఇళ్లు వస్తాయని తెలిపారు. మొదటి దశలో ఇల్లు లేకుండా ఖాళీ స్థలం ఉన్న పేదలకే మంజూరవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండలప్రత్యేకాధికారి మధుసూదన్‌రాజు, ఎంపీడీవో క్రాంతి, టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్, డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, సొసైటీ మాజీ చైర్మన్ బండారు వెంకన్న, బండారు దయాకర్, గండి శ్రీనివాస్, గంట బాలకృష్ణారెడ్డి, కార్యదర్శి అరుణ్‌జ్యోతి పాల్గొన్నారు.

● ఇనుగుర్తి : మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారుల ఎంపిక కోసం సర్వేను అధికారులు ప్రారంభించారు. గతంలో ప్రజాపాలన దరఖాస్తుల్లో ఇందిరమ్మ ఇంటి కోసం విజ్ఞప్తి చేసిన అర్జీదారుల ఇళ్లను సర్వే చేస్తున్నారు. మండల ప్రత్యేకాధికారి కృష్ణవేణి, కార్యదర్శి లక్ష్మీకాంత్, కాంగ్రెస్ గ్రామపార్టీ అధ్యక్షుడు గంజి రాజేందర్‌రెడ్డి, గుజ్జునూరి బాబురావు, కుంచాల రమేష్, చిన్నాల కట్టయ్య, పరుపాటి రాములు, నాగెళ్లి మురళి, నారాయణ పాల్గొన్నారు.

● డోర్నకల్ : డోర్నకల్ మునిసిపాలిటీలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను మునిసిపల్ సిబ్బంది చేపట్టారు. ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు సర్వే నిర్వహిస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. డోర్నకల్ మునిసిపాలిటీ పరిధిలో 2600 మందికిపైగా ఇండ్ల నిర్మాణాల కోసం దరఖాస్తులు చేసుకున్నట్లు చెప్పారు. వారిలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించనున్నట్లు సిబ్బంది తెలిపారు. సర్వే సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తల హడావుడి కన్పించింది.

● దంతాలపల్లి : ఇందిరమ్మ యాప్ ద్వారా లబ్ధిదారుల ఎంపికకై ఇంటింటా సర్వేను పంచాయతీ కార్యదర్శులు చేట్టారు. దీంతో శుక్రవారం మండలంలోని పెద్దముప్పారంలో ఎంపీడీవో వివేక్‌రాం, ఎంపీవో మహ్మద్ అప్సరపాష, దంతాలపల్లి, తూర్పుతండాలో తహసీల్దార్ రాజేశ్వర్ యాప్ ద్వారా నమోదు చేస్తున్న ప్రక్రియను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. ఇటీవల ఇంటింటా జరిగిన కుటుంబ సమగ్ర సర్వేలో ఇచ్చిన సమాచారం ఇందిరమ్మ యాప్‌కు అనుసంధానం అయిందన్నారు. జీపీ కార్యదర్శులు వెంకన్న, శ్రీను, సృజన, మమతశ్రీ, నాగర్జున, అజయ్, మధు, శ్రీధర్, కోటేష్, విజయ్‌కుమార్, భూలక్ష్మి, మల్లికార్జున్‌స్వామి పాల్గొన్నారు.

అన్ని దానాల్లో కెల్లా అన్నదానం గొప్పది

మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : అన్నిదానాల్లో కెల్లా అన్నదానం మహా గొప్పదని మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని శ్రీఅయ్యప్పస్వామి దేవాలయంలోని అన్నదాన సత్రంలో శుక్రవారం మునిసిపల్ వైస్ మార్నేని వెంకన్న అయ్యప్పస్వాములకు భిక్షను ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ చిట్యాల జనార్దన్, వార్డు కౌన్సిలర్ ఎడ్ల వేణుమాధవ్, మార్నేని రఘు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సీఎం కప్‌కు ఎంపిక

కేసముద్రం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం విలేజి శ్రీ వివేకావర్ధిని హైస్కూల్ విద్యార్థులు జిల్లాస్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ చిర్ర యాకాంతంగౌడ్, ప్రిన్సిపాల్ చిర్ర నరేష్‌లు తెలిపారు. గురువారం ధన్నసరి సేయింట్ జాన్స్ స్కూల్లో నిర్వహించిన మండల స్థాయి ఖోఖో పోటీల్లో బి.అనిరుధ్, వి.భరత్, వి.నగేష్, కె.ప్రణయ్, హర్షి, వి.అజయ్‌లు పాల్గొని మహబూబాబాద్ పట్టణం ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించబోయే జిల్లాస్థాయి ఎంపికైనట్లు వారు తెలిపారు.

శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు


వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మాట్లాడుతున్న తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మండలం ముడుపుగల్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. ముడుపుగల్ గ్రామంలో నిర్మితమవుతున్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని శుక్రవారం ఎమ్మెల్సీ సందర్శించారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం తనవంతు సహకారం అందిస్తానని స్పష్టం చేశారు. ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ యాస వెంకట్‌రెడ్డి, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు జేరిపోతుల వెంకన్నగౌడ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

హామీలను వెంటనే అమలు చేయాలి

● టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేష్ అన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం సీసీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ మేరకు పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. జీవో 317 వల్ల స్థానికత కోల్పోయిన అందరిని సొంత జిల్లాలకు పంపాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని, బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రెడ్డి, షైన శ్రీనివాస్, శ్రీశైలం, శ్రీనివాస్, విష్ణువర్ధన్, ఉపేందర్, బిక్షపతి, రామలింగారెడ్డి, యాకయ్య, వెంకటేశ్వర్లు, బాబురావు, విజయ్‌రాజ్, కార్తీక్, రఫిక్, నరేష్, చంద్రమౌళి, ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఫీజుల దోపిడీ కొనసాగుతోందని, దానిని అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోకాళ్ల రమేష్, ఎలకంటి రాజేందర్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌జిల్లాకేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ప్రైవేట్ ఆస్పత్రులపై టాస్క్‌ఫోర్స్ దాడులు నిర్వహించి అక్రమంగా నడిపిస్తున్న ఆస్పత్రులను మూసివేయాలన్నారు. రోగుల వద్ద నుంచి ఇష్టానుసారంగా వసూలు చేస్తున్న ఫీజుల దందాను అరికట్టాలని చెప్పారు. ఈ సమావేశంలో తుడుం వీరభద్రం, భానుచందర్, భట్టు చైతన్య, వెంకటస్వామి పాల్గొన్నారు.

'విలీన గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలి'

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ మునిసిపాలిటీలో విలీనమైన గ్రామాల్లో ఉపాధి హామి పనులు కల్పించాలని సీపీఎం పట్టణ నాయకులు నక్క సైదులు డిమాండ్ చేశారు. మహబూబాబాద్ మునిసిపల్ 10వవార్డు పరిధి వీరారం తండా, చెరువు కొమ్ము తండా, ముత్యాలమ్మ తండాలో ప్రజా సమస్యలపై అధ్యయనం సీపీఎం ఇంటింటి సర్వేను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ...మునిసిపాలిటీ విలీన గ్రామాల్లో ఉపాధి పనులు లేక పోవడంతో అక్కడ కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హేమానాయక్, సతీష్, సురేందర్, గాడిపెల్లి వెంకటేష్, పద్మ, గుగులోతు కిషన్, బాలు, లాల్‌సింగ్ పాల్గొన్నారు.

●శివారు కాలనీలు, తండాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు


వీరారం తండాలో ప్రజాసమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

నిర్మించి ప్రజాసమస్యలను పరిష్కరించాలని సీపీఎం 6వ వార్డు ఇన్‌చార్జి ఎమ్డీ. రజాక్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ మునిసిపల్ 6 వవార్డు పరిధిలోని మాన్సింగ్ తండాలో, భజనతండాలో సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే చేపట్టారు. బాబుమియా, లీల, రఫీ, నరేష్, కవిత, కృష్ణ రమణ, పద్మ, విజయ, వెంకన్న పాల్గొన్నారు.

● మునిసిపల్13వ వార్డు పరిధిలోని వేల్పుల సత్యంనగర్, బాలాజీనగర్ కాలనీలో సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటి సర్వేను నిర్వహించారు. అక్కడ ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. పట్టణ కమిటీ సభ్యులు కుమ్మరికుంట్ల నాగన్న, బోడ శంకర్, రమేష్, బాలు, విజయ, మనీ, స్వరూప, వెంకన్న, శ్రీరాములు, నాన్కి, బ్రహ్మం, శ్రీను, వీరన్న, ఫక్కి, ఆజాద్, జ్యోతి, విజయ, రఘు, వెంకటేష్, ఉపేందర్ పాల్గొన్నారు.

● మునిసిపల్ 30వవార్డులో నిర్వహించిన ఇంటింటికి సీపీఎం సర్వేలో మాజీవార్డు కౌన్సిలర్ శాగంటి భాగ్యమ్మ, గాడిపెల్లి ప్రమీల, మాదాసు రాజు, గాడిపెల్లి శ్యామ్, పాక నాగార్జున, పూల ఉపేందర్, శాగంటి వీరన్న పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

'రైతులకు బేడీలు వేస్తారా..'

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి) : లగచర్ల ఘటన కేసులో రిమాండ్ ఖైదీగా జైల్లో ఉన్న హీర్యానాయక్‌కు పోలీసులు బేడీలు వేసి, ఆస్పత్రికి తీసుకువెళ్లడం దుర్మార్గపు చర్య అని అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల బిక్షపతి, ప్రధాన కార్యదర్శి గౌని ఐలయ్య శుక్రవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. లగచర్ల సహ ఐదు గ్రామాలకు చెందిన 13 వేల ఎకరాల భూములను ఫార్మా కంపెనీల కోసం తీసుకునేందుకు ప్రయత్నించిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజా ఉద్యమానికి తలొగ్గి దానిని వెనక్కితీసుకున్నట్లుగా ప్రకటించిందన్నారు. గిరిజన రైతు హీర్యానాయక్‌కు బేడీలు వేసి వైద్యచికిత్స కోసం తీసుకువెళ్లడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు.

'డిజిటల్'కు చట్టబద్ధత కల్పించాలి


కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న డీఎంజేయూ బాధ్యులు

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ మీడియా జర్నలిస్టులకు చట్టబద్ధత కల్పించాలని డిజిటల్ మీడియా జర్నలిస్ట్ యూనియన్ (డీఎంజేయూ) జాతీయ ప్రధాన కార్యదర్శి చందా శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డు అశోక్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, డీపీఆర్వో రాజేంద్రప్రసాద్‌కు శుక్రవారం వినతి పత్రాలను అందజేశారు. కె.ప్రభాకర్, పి.లక్ష్మయ్య, పవన్, మహేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

●మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని 3వ వార్డు కౌన్సిలర్ సంగీత రవి తల్లి గీత అనారోగ్యంతో మరణించగా, ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. 15వ వార్డు బీఆర్ఎస్ నాయకుడు వెంకన్న ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని, ఎలాంటి కలత చెందవద్దని తెలిపారు. నాయకులు సీతారాములు, మంగళపల్లి శ్రీనివాస్, అంజయ్య, వెంకన్న, శ్రీనివాస రావు, క్రు శ్రీను, నాగరాజు, కాలునాయక్, ఆశయ్య, సంగీత రవి ఉన్నారు.

రాష్ట్రస్థాయి గణిత పోటీలకు విగ్నేష్

మహబూబాబాద్‌ఎడ్యుకేషన్, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈనెల 22న జరగనున్న రాష్ట్రస్థాయి గణిత టాలెంట్ టెస్ట్ పోటీలకు కంబాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి విగ్నేష్ ఎంపికైనట్లు హెచ్‌ఎం రమేష్‌బాబు తెలిపారు. స్థానిక పాఠశాలలో శుక్రవారం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని ప్రశంసా పత్రం, మెమోంటోతో అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 11న మాటేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ద్వితీయస్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఉపాధ్యాయులు విష్ణువర్దన్, ఉప్పలయ్య, సోహెన్‌బి, తిరుపతి, శిభారాణి, సోమేశ్వర్, ఝాన్సీ, వెంకటేశ్వర్లు, మల్లారెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్, మహిళల భద్రతపై అవగాహన

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) :మహబూబాబాద్ శివారు జమాండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్‌క్రైమ్, మహిళల భద్రత, క్రీడల ప్రాముఖ్యతపై శుక్రవారం రూరల్ సీఐ సర్వయ్య అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ అపరచిత వ్యక్తుల నుంచి వచ్చిన ఫోన్‌కాల్స్‌ను లిఫ్ట్ చేయకూడదని చెప్పారు. మహిళలను ఎవరైన వేధింపులకు గురిచేస్తే డయల్ 100కు కాల్ చేయాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ సమావేశంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, రూరల్ ఎస్సై దీపికరెడ్డి, సంపత్, రాందాస్, విద్యార్థినులు పాల్గొన్నారు.


సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రూరల్ సీఐ సర్వయ్య

ఆదివాసీలకు దుప్పట్లు, టార్పాలిన్‌ల పంపిణీ


ఆదివాసీలకు టార్పాలిన్‌లు, దుప్పట్లు అందజేస్తున్న వరప్రసాద్, వెంకట్‌రెడ్డి

గూడూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) మహబూబాబాద్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో గూడూరు మండలం వీరంపేట, కొత్తగూడ మండలం కార్లాయిలో ఆదివాసీలకు టార్పాలిన్‌లు, దుప్పట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ పి.వరప్రసాద్, కోశాధికారి మాదవపెద్ది వెంకట్‌రెడ్డి మాట్లాడారు. గూడూరు మండలంలోని వీరంపేట, కొత్తగూడ మండలంలోని కార్లాయి ప్రాంతాల ప్రజలు వర్షకాలంలో తమ ఇండ్లు కురుస్తున్నాయని, తమకు సాయం అందించాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. ఈ విషయంపై తెలంగాణ రాష్ట్ర రెడ్‌క్రాస్ సొసైటీ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. దీంతో వీరంపేటలో 52 మందికి టార్పాలిన్‌లు, 52 మందికి దుప్పట్లు, కొత్తగూడ మండలం కార్లాయిలో 45 మందికి టార్పాలిన్‌లను అందజేసినట్లు వారు చెప్పారు. ఉపాధ్యాయులు కట్ల వెంకన్న, సుధాకర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

'దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి'


ఉత్సవాల వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని యశోద గార్డెన్స్‌లో ఈనెల 16న నిర్వహించనున్న నవతెలంగాణ విద్యార్థి సంఘం (ఎన్‌టీవీఎస్) దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ రామన్ననాయక్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లోని జెఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం దశాబ్ది ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలో స్పెషల్ డీఎస్సీ వేయాలన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి 250 గజాల ఇంటిస్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. జీవో నెంబర్ 29, ఈడబ్ల్యూఎస్ కోటాను రద్దు చేయాలన్నారు. ఈ ఉత్సవాలకు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్ హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు తిరుపతి, విజయ్‌కుమార్, రమేష్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సుందర్‌నాయక్, రవీందర్, సంఘం బాధ్యులు వీరేష్, సుభాష్, వెంకన్న, సూరయ్య, తరుణ్, భగత్‌సింగ్ పాల్గొన్నారు.


జిల్లా కార్మిక శాఖ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందిస్తున్న తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం నేతలు

'పెండింగ్ క్లైయిమ్స్ చెల్లించాలి'

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న క్లైయిమ్స్ ఇతర బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శంకర్ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు మహబూబాబాద్‌లో కార్మిక శాఖ అసిసెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ (ఏసీఎల్) నారాయణస్వామికి శుక్రవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా 1996 కార్మిక చట్ట ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా అడ్డాల వద్ద షెడ్‌లు, మంచినీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు వంటి మౌళిక వసతులు కల్పించాలని కోరారు. వివిధ జిల్లాలో కార్మిక శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, దళారీ వ్యవస్థను తొలగించి కార్మిక సంఘాలు ప్రతిపాదించిన క్లైమ్‌లను పరిష్కరించి విడుదల చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలోజానీ, కొమ్ము యాకయ్య, మహమూద్, సురేష్, కేదాసు రమేష్, కూరాకుల పాల్, బచ్చలి ఐలయ్య, రమాదేవి, నవత పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని చదవాలి

● జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని విద్యనభ్యసించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ అన్నారు. కలెక్టరేట్‌లో చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) సహకారంతో ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు మూడు నెలల పాటు నిర్వహించే ప్రేరణ కార్యక్రమ పోస్టర్లు, కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యతోనే ముందడుగు సాధ్యమని, విద్యార్థులకు తొలిమెట్టు పదో తరగతి అని క్రమశిక్షణతో విద్యనభ్యసించి, ఉన్నత స్థానాలకు చేరుకుని ఆదర్శంగా నిలవాలన్నారు. సీడబ్ల్యూసీ జిల్లా చైర్‌పర్సన్ డాక్టర్ నాగవాణి, ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు, కార్యక్రమ రూపకర్త డాక్టర్ పరికిపండ్ల అశోక్, సీడబ్ల్యూసీ సభ్యుడు డాక్టర్ డేవిడ్, వి.ఏలియా, రమేష్ పాల్గొన్నారు.

'సస్యరక్షణ చర్యలు చేపట్టాలి'

గంగారం, డిసెంబరు13 : బద్దెపురుగు, కత్తెర పురుగు నివారణకు సస్యసరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయశాఖ అధికారి రాంబాబు కోరారు. శుక్రవారం యాసంగి వేసిన మొక్కజొన్న పంటక్షేత్రాలను పరిశీలించారు. ఈ పంటలో కత్తెర పురుగు, బద్దె పురుగులను గమనించామన్నారు. ఈ పురుగు నివారణకు పది కేజీల తవుడులో రెండు కేజీల బెల్లం కలిపి ఆ మిశ్రమంలో వంద గ్రాములు థయడికార్బ్‌ను కలిపి 24 గంటలు నానబెటిట్టిన తరువాత సాయంత్రం పూట చల్లుకోవాలన్నారు. అలాగే ఇమామెక్టిన్ బెంజోయేట్ మందును 0.4 గ్రాములు, స్పైనోసాడ్ 0.3 గ్రాములు లీటరు నీటిలో కలిపి తీసుకుని సాయంత్రం పూట పిచికారి చేయాలని తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

తహసీల్దారు రమాదేవి

కొత్తగూడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు వ్యాపారులు ధాన్యం కొనుగోళ్లలో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దారు రమాదేవి హెచ్చరించారు. కొత్తగూడలోని గాంధీనగర్‌లో ప్రైవేట్ వ్యాపారి చేస్తున్న ధాన్యం కొనుగోళ్లను రమాదేవి శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగాఉపయోగిస్తున్న తూనిక యంత్రాలను సీజ్ చేశారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

పశువుల ఆస్పత్రిలో సౌకర్యాలను మెరుగుపరచాలి

డోర్నకల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ పశువుల ఆస్పత్రిలో సౌకర్యాలను మెరుగుపరచాలని రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. పశువుల ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరి అస్పత్రి భవనం పైకప్పు పెచ్చులూడి మీదపడుతున్నాయని, వర్షం వచ్చినప్పుడల్లా కురుస్తుందని చెప్పారు. మందులు నిల్వ చేయడానికి సరైన సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు, సిబ్బంది వాపోతున్నారు. ఇప్పటికైనా పశువుల ఆస్పత్రికి నూతన భవనం మంజూరు చేసి మౌళిక వసతులు, సౌకర్యాలు కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

రేపు బీజేపీ బూత్ కమిటీ సమావేశం

మరిపెడ రూరల్, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి) : చిల్లంచర్లలో బీజేపీ బూత్ కమిటీ సమావేశం శనివారం ఉందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కట్బోజు గంగాధర్ తెలిపారు. మండలంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ బీజేపీ గ్రామశాఖ అధ్యక్షులు, పదాధికారులు, అభిమానులు అందరూ హాజరుకావాలని కోరారు.

మహాధర్నాను సక్సెస్ చేయాలి

పెద్దవంగర, డిసెంబర్13 (ఆంధ్రజ్యోతి) : జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 17న హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మహాధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రగతీశీల గ్రామ పంచాయతీ వర్క్‌ర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నవంగరలో జీపీ కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు. మండలంలోని అన్నిగ్రామాల నుంచి జీపీ కార్మికులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపు నిచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షులు పొడియ బీకు, నాయకులు సోమ నర్సయ్య, తొగరు మధుకర్, లక్ష్మణ్, పద్మ, సోమయ్య పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడలకు పీఎస్ఆర్ విద్యార్థులు ఎంపిక

తొర్రూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం ప్రజాపాలన వారోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడలకు పీఎస్ఆర్ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ పొనుగోటి సోమేశ్వర్‌రావు తెలిపారు. శుక్రవారం పాఠశాలలో ఆయన మాట్లాడుతూ గత మూడు రోజులుగా నిర్వహించిన సీఎం కప్ క్రీడల్లో తమ పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపికకావడం అభినందనీయమని అన్నారు. ప్రతిభ కనబర్చిన 10మంది విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ రీనా, పీఈటీ సోమన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

'గొర్ల పంపిణీ చేపట్టాలి'

తొర్రూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో గొల్ల కుర్మలకు రెండోవిడత గొర్ల పంపిణీ చేపట్టాలని గొర్ల మేకల పెంపకం దార్ల సంఘం జిల్లా కార్యదర్శి బొల్లం అశోక్ అన్నారు. శుక్రవారం తొర్రూరులోని కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం మొదటివిడత పంపిణీ చేసి రెండో విడత పంపిణీ చేయకుండా మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అధికారంలోకి రాగానే వంద రోజుల్లో రెండో విడత పంపిణీ చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందని, ఇచ్చిన హామీని నెర వేర్చాలని కోరుతూ ఈనెల 19న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద జరిగే ధర్నాకు గొల్ల కుర్మలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. జీఎంపీఎస్ నాయకులు కె.యాకయ్య, ఐలయ్య, రామకృష్ణ, నాగరాజు, యాకయ్య, అశోక్, మధు ఉన్నారు.

హామీలను వెంటనే నెరవేర్చాలి

తొర్రూరు రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని తక్షణమే నెరవేర్చాలని సీపీఎం మండల కార్యదర్శి ఎమ్డీ.యాకూబ్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండలం లోని అమ్మాపురంలో మండల కమిటీ ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీపీఎం నాయకులు యాకయ్య, సోమయ్య, ప్రవీణ్, యాకాంత, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

కమ్యూనిస్టులను ఆదరించాలి

చినగూడూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక ఎన్నికల్లో నిజాయితీగా ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేసే కమ్యూనిస్టులను ప్రజలు ఆదరించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం గుండంరాజుపల్లిలో నిర్వహించిన గ్రామ సీపీఐ సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈనెల 26న సీపీఐ 99వ ఆవిర్భావ ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సీపీఐ మండల కార్యదర్శి గంజి శేషాద్రిరెడ్డి, దొంతు స్టాలిన్, పోలెపాక వెంకన్న పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలకు రూ.2.5 లక్షలు మంజూరు

● తహసీల్దార్ రాజేశ్వర్ వెల్లడి

'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

దంతాలపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 9న సమస్యల 'వలయంలో ప్రభుత్వ గిరిజన వసతి గృహం' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం కావడంతో జిల్లా సం బంధిత అధికారులు స్పందిచారు. ఈనెల 10న తహసీల్దార్ రాజేశ్వర్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గిరిన ఆశ్రమ పాఠశాలను సందర్శించి పెచ్చులూడుతున్న సంఘటనపై పూర్తిస్థాయిలోనివేదికను ఇచ్చారు. గురువారం జిల్లా ట్రైబల్ అధికారులు తాత్కాలిక పనులకై రూ.2.5 లక్షలు మంజూరు చేసినట్లు తహసీల్దార్ రాజేశ్వర్ పేర్కొ న్నారు. త్వరలో పనులు కానున్నాయన్నారు.

రైతాంగానికి 24 గంటలు త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా

● ఎన్‌వీ వేణుగోపాల్‌చారి

దంతాలపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రైతాంగానికి ఇరువై నాలుగు గంటలు త్రీఫేజ్ విద్యుత్‌ను సకాలంలో సరఫరా చేస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ (సీజీఆర్ఎఫ్-1) చైర్‌పర్సన్ ఎన్.వి.వేణుగోపాల్‌చారి అన్నా రు. శుక్రవారం మండల కేంద్రంలోని 33/11కేవీలో నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ తొర్రూరు డివిజన్ ఆధ్వర్యంలో వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లికుదురు, మునిగలవీడు, దంతాలపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో 32 మంది రైతులు తమ తమ సమస్యలపై ఫిర్యాదు చేశారు. దీంతో సంబంధిత అధికారులు జనవరి కల్లా సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ జంగం నరేష్, డీఈ మధుసూదన్, ఏడీఈ చలపతిరావు, స్థానిక ఏఈ మంగళపెల్లి ప్రవీణ్, మునిగలవీడు ఏఈ భార్గవి, నెల్లికదురు ఏఈ నెల్లుట్ల సింధు, సబ్ ఇంజనీరు తరుణ్ పాల్గొన్నారు.